క్లుప్తంగా

జోరుగా ఓటరు నమోదు



జాలంపల్లిలో ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: మండలంలోని జాలంపల్లి పంచాయతీలో ఓటరు నమోదు, సర్వే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో తప్పులు దొర్లితే సరి చేస్తున్నారు, కొత్త ఓటర్ల వివరాలను నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, సర్పంచ్ దారా మల్లేశ్వరిచిన్ని, ఉప సర్పంచ్ బోరలక్ష్మి చిన్న తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేపై నోటీసులు

మాడుగుల రూరల్: మాడుగుల రెవెన్యూ పరిధిలోని పప్పుసేటి చెరువు చేను కళ్లాల ఆయకట్టుదార్లకు కేజే పురంలో వీఆర్వో ఎస్.లీల సోమవారం నోటీసులు అందించారు. జగనన్న భూ సర్వే కార్యక్రమంలో పప్పుసేటి చెరువు భూములను రీసర్వే చేశారు. సర్వేలో భూయజమాన్లు తమ భూముల వివరాలను చెక్ చేసుకుని, అభ్యంతరాలుంటే తెలపాల్సిందిగా సదరు నోటీసుల్లో పేర్కొన్నారు.

పెద్దేరు నీరు విడుదల రేపు

మాడుగుల: మండలంలో అత్యంత జల వనరులు గల పెద్దేరు జలాశయం ప్రధాన పంట(రాచకట్టు) కాలువ ద్వారా సాగు నీటిని మంగళవారం ఉదయం 8 గంటలకు విడుదల చేయనున్నట్టు వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ తెలిపారు. సోమవారం మండలంలోని జేడీపేటలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ వరి సాగుకు వీలుగా నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి పెద్దేరు ఆయకట్టు రైతులతో పాటు ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని రాజారామ్ కోరారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

మాకవరపాలెం: పదోతరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బూరుగుపాలెం సర్పంచ్ వొబ్బలరెడ్డి రమణ నగదు ప్రోత్సాహకాలు అందించారు. బూరుగుపాలెం హైస్కూల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పూడి గీతాంజలికి రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వబ్బలరెడ్డి పూజితకు రూ.2,500, తృతీయ స్థానంలో నిలిచిన యాదగిరి జ్యోతికి రూ.వెయ్యి చొప్పున నగదు ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలంటూ స్వీపర్ల ధర్నా

బుచ్చెయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ స్వీపర్లు తమ జీతాల బకాయిలు చెల్లించాలంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద టెంట్ వేసి సోమవారం ధర్నా చేశబూరు. 23 మాసాలుగా తమకు రావాల్సిన బకాయిల్ని చెల్లించకపోవడంతో, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించి, ఆదుకోవాలంటూ ఎంపీడీవో సువర్ణరాజుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు పి.సాంబశివరావు, సభ్యులు పాల్గొన్నారు.

క్రైస్తవ సోదరుల శాంతి ర్యాలీ

నర్సీపట్నం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులకు నిరసనగా క్రైస్తవ సంఘాల నాయకులు సోమవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. వేలాది క్రైస్తవ సోదరులతో సీబీఎం కాంపౌండ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో త్వరితగతిన శాంతిని నెలకొల్పాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ర్యాలీని ఉద్దేశించి క్రైస్తవ సంఘ నాయకులు ఎం.కృప సెల్వన్, పీలా వెంకటలక్ష్మి, ప్రేమ్ కుమార్, బెంజిమన్, అర్జున్‌రావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ సహకారంతోనే క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాలు కళ్లు తెరిచి దాడులను అరికట్టాలన్నారు. ర్యాలీలో దైవజనులు, ఆయా సంఘాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ వితరణ

చోడవరం రూరల్: మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేందుకు బిగ్‌హెల్ప్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.వి.లక్ష్మి నోట్ పుస్తకాలు, విద్యాసంబంధ విషయావగాహన పెంచే పుస్తకాలు, స్టేషనరీని సోమవారం అందించారు. హెచ్ఎం ఎ.వి.జగన్నాథరావు, సిబ్బంది గౌరీశంకర్, డి.కొండలరావు, ఎం.విద్యాసాగర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో రగడ

● విమర్శలను తిప్పికొట్టిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి



సభలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం

నర్సీపట్నం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యుల అరుపులు, కేకలతో గందరగోళంగా మారింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎజెండాలోని అంశాలను మున్సిపల్ అధికారులు సభ ముందుంచారు. సభ జరుగుతున్న సమయంలో 20వ వార్డు టీడీపీ కౌన్సిలర్ రామరాజు తన వార్డులో సమస్యలను పట్టించుకోవటం లేదంటూ చెప్పుతో కొట్టుకోవడంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు కల్పించుకుని, మీ టీడీపీ మంత్రులు అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ రోజు మీ పార్టీ కౌన్సిలర్ చెప్పుతో కొట్టుకోవాల్సి వచ్చిందని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకవర్గంలో ప్రతిపక్ష కౌన్సిలర్లగా ఉన్న తాము అభివృద్ధి కోసం ఎంత ప్రాధేయపడినా అప్పటి టీడీపీ నాయకులు పట్టించుకోలేదని, మీరు చేసిన పాపమే ఈ రోజు మీ కౌన్సిలర్ తన చెప్పుతో తన చెంప వాయించుకోవాల్సి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఈ సమయంలో టీడీపీ కౌన్సిలర్ మధు జోక్యంతో వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు బయపురెడ్డి చినబాబు, సిరసపల్లి నాని మధ్య మాటల యుద్ధం మొదలయింది. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల అరుపులు, కేకలతో సభ స్తంభించింది.

17వ సచివాలయాల్లో రూ.3.40 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలని టీడీపీ కౌన్సిలర్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కమిషనర్ కనకారావు బదులిస్తూ ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం కేటాయించిందని, నామినేషన్ పద్ధతిలో ఈ పనులను అప్పటించినట్టు బదులిచ్చారు. అధికారిక కార్యక్రమాలకు తమను ఎందుకు పిలవటం లేదని విపక్ష పార్టీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. చైర్‌పర్సన్ కల్పించుకుని పిలిస్తే వస్తారా? రాకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలని ఎదురు ప్రశ్నించారు. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల కేకలు, అరుపుల మధ్యే పలు అంశాలపై చర్చ పూర్తయి, కౌన్సిల్ సమావేశం ముగిసింది.

విద్యుత్ అంతరాయంతో అవస్థలు

మాడుగుల రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ కె.జె.పురంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు శాలిపేట వద్ద చిన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం ఉదయం 11 గంటలు వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. దీంతో వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



కె.జె.పురంలో లైన్‌మన్ సోంబాబుతో మాట్లాడుతున్న గ్రామస్తులు

లైన్‌మన్ సోంబాబు విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బందితో కలిసి కృషి చేశామని చెప్తున్నా, రాత్రి నుంచి విద్యుత్ సిబ్బందికి ఫోన్ చేస్తున్నా స్పందించలేదని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామంలో లోవోల్టేజ్ సమస్య అధికంగా ఉందని విద్యుత్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు.

ముందు జాగ్రత్తతో లంపీస్కిన్ నియంత్రణ



మాట్లాడుతున్న ఏడీ చిట్టినాయుడు



కె.కోటపాడు సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి

మాడుగుల: ఈ నెల 1 నుంచి 31 వరకు చీడికాడ, మాడుగుల మండలాల్లో పశువులకు ఉచిత లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్టు స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు తెలిపారు. సోమవారం స్థానిక ఏడీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ టీకాలు ఉచితంగా వేయించడానికి దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు. 4 మాసాల వయసు దాటిన ఆడ, మగ పశువులకు ఈ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. చీడికాడ మండలానికి 6 వేల డోసులు, మాడుగుల మండలానికి 8,700 డోసులు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. పాడి రైతులు సంతల్లో కొత్తగా పశువులను కొనుగోలు చేసి, గ్రామంలోకి తీసుకురాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధి సోకిన పశువులను మిగిలిన పశువులకు దూరంగా ఉంచాలన్నారు. పశువులకు దద్దుర్లతో కూడిన జ్వరం వస్తే, వెంటనే పశు వైద్యులను సంప్రదించాలన్నారు.

కె.కోటపాడు : లంపీస్కిన్ వ్యాధి బారిన పశువులు పడకుండా ముందస్తు టీకాలు వేయనున్నట్లు కె.కోటపాడు పశుసంవర్ధక శాఖ ఏడీ జి.బైరాగి తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల ఆర్బీకేల్లో పని చేస్తున్న పశువైద్య సహాయకులతో కె.కోటపాడులో సోమవారం సమావేశమయ్యారు. ఆగస్టు 1 నుండి 31 వరకూ లంపీస్కిన్ టీకాలను ఆర్బీకేల పరిధిలోని నిర్దేశిత పశువులకు వేయాలని సూచించారు. ఇప్పటికే కె.కోటపాడులో 8,400, దేవరాపల్లిలో 6 వేల టీకాలను అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. వీటితో పాటు ఆర్బీకేల పరిధిలో టీఎంఆర్ దాణా అవసరమైన రైతులకు రాయితీపై అందించే చర్యలను తీసుకోవాలన్నారు. సమావేశంలో కొరువాడ పశువైద్యాధికారి సీహెచ్‌వైనాయుడు, మౌనిక, అలేఖ్య, ప్రియాంక, మంజూష రాణి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ హింసపై సీపీఎం నిరసన

మాడుగుల రూరల్: మణిపూర్ మారణకాండను ఖండించండి, బీజేపీ విద్వేష రాజకీయాలను ప్రతిఘటించండి అంటూ సీపీఎం ఆధ్వర్యంలో మాడుగులలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ప్రజలకు పంచారు. పార్టీ మండల కార్యదర్శి ఇ.నర్సింహమూర్తి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో గత మూడు మాసాలుగా సాగుతున్న హింసను, దానికి కారణమైన కేంద్ర ప్రభుత్వ అలసత్వాన్ని ఆక్షేపించారు. ప్రజాస్వామ్యాన్ని, సామరస్యాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. కేంద్రంలో మోదీ, ఆ రాష్ట్రంలో బీరేన్‌సింగ్‌లు మణిపూర్‌ను రావణకాష్టంగా మార్చారని ఆరోపించారు. కార్యక్రమంలో జానీ కోటేశ్వరరావు, విజయ శాంతి, గిరిజనులు పాల్గొన్నారు.

మహిళల పొదుపుతో కుటుంబానికి భరోసా

మాడుగుల: గ్రామీణ ప్రాంతంలో మహిళల చేత పొదుపు చేయించడంతో పాటు, తక్కువ వడ్డీకు ఎటువంటి హామీ లేకుండా రుణాలు అందించి, నిరుపేద కుటుంబాలను ఆదుకోవడమే మానస మహాలక్ష్మి సంఘ లక్ష్యమని ఆ సంఘ సీఈవో పరమేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షురాలు పడాల అమ్మాజీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంఘ 23వ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. చీడికాడ, మాడుగుల, బుచ్చయ్యపేట మండలాల్లో సంఘం కార్యకలాపాలను విస్తరించి, నిరుపేద మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు అందించి, వారి కుటుంబాలకు భరోసానిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు అప్పలబత్తుల దేవి, బి.భవాని, డి.మాధవి, సంస్థ సిబ్బంది దేవి, రూప, హేమ, పద్మలతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి

భవన యజమానుల నుంచి ఎన్‌ఓసీలు తీసుకున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం మెయిన్‌రోడ్డును విస్తరణకు భవన యజమానులు సహకరించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. భవన యజమానుల మద్దతును కూడగట్టేందుకు ఎమ్మెల్యే మరోసారి రంగంలోకి దిగారు. దీనిలో భాగంగా సోమవారం ఆయన పెద బొడ్డేపల్లి మదుం నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులను కలిసి రోడ్డు విస్తరణకు నిరభ్యంతర పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 120 అడుగులకు మార్కింగ్ ఇచ్చారని గుర్తు చేశారు. భవన యాజమానులకు ఎక్కువ మొత్తంలో నష్టం జరగకూడదనే ఉద్దేశంతో వంద అడుగులకు విస్తరించాలని నిర్ణయించామన్నారు. వంద అడుగులకు కాకుండా 80 అడుగులకు కుదించాలని భవన యజమానులు కోరారు. అందువల్ల భవిష్యత్తులో పెద్దగా ప్రయోజనం ఉండదని ఎమ్మెల్యే చెప్పారు. చివరికి భవన యజమానుల అభ్యర్థన మేరకు రోడ్డును 90 అడుగుల మేర విస్తరించేందుకు నిర్ణయించినట్టు వెల్లడించారు. దీనికి యజమానులు సానుకూలంగా ముందుకువచ్చి నిరభ్యంతర పత్రాలను ఇస్తున్నారని పేర్కొన్నారు. కొంత మంది యజమానులు రోడ్డు విస్తరణను అడ్డుకోవాలనే ఆలోచన మానుకుని, సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణకు వీలుగా విద్యుత్ స్తంభాల తొలగింపు ప్రక్రియ చేపట్టాలని విద్యుత్ శాఖకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కమిషనర్ కనకారావు ఉన్నారు.

సామాజిక తనిఖీలతో పారదర్శకత

దేవరాపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా మండల ప్రజా వేదిక సమావేశం సోమవారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రజా వేదికలో స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం పాల్గొన్నారు. ఉపాధి పథకంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు రూ.20 కోట్ల, 37 లక్షల 26 వేల 299 వ్యయంతో చేపట్టిన 588 పనులపై అధికారులు సామాజిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజావేదికలో డ్వామా అడిషనల్ పీడీ రోజా రాణి, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలదేవి, ఏపీడీ శ్రీనివాస్ గ్రామాల వారీగా సోషల్ ఆడిట్ బృందాలు గుర్తించిన లోపాలను సదస్సులో చదివి వినిపించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో గుర్తించిన లోపాలపై సమర్పించిన ఆధారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజేశ్వరీ, జెడ్పీటీసీ కర్రి సత్యం మాట్లాడుతూ సోషల్ ఆడిట్‌తో ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత నెలకొందన్నారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్ సూర్యనారాయణ, ఉపాధి హామీ ఏపీవో డి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల సమావేశం నేడు

నాతవరం: మండల కేంద్రంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల సమావేశం ఏర్పాటు చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులతో పాటు వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరుకావాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా నియమితులై మొదటి సమావేశం కావడంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ప్రగతిని చర్చించనున్నారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టి నమూనాను సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

నాతవరం: రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో భూసార పరీక్షల్లో భాగంగా మట్టి నమూనాల సేకరణ పూర్తి అయిందని మండల వ్యవసాయాధికారి శైలజ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మట్టి నమూనాలు సేకరించి అనకాపల్లి జిల్లా భూసార పరీక్షా కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంతవరకు మండల వ్యాప్తంగా 645 మట్టి నమూనాలు సేకరించామన్నారు. భూసార పరీక్షలు చేశాక, భూమిలో ఉన్న లోపాలను కార్డులో నమోదు చేసి రైతులకు అందిస్తామన్నారు. లోపాల ఆధారంగా వాటిని అధిగమించేందుకు ఏం వినియోగించాలో కూడా చెప్తామన్నారు. అనకాపల్లి భూసార పరీక్షా కేంద్రంలో టెస్టింగ్ పూర్తయ్యాక రైతులకు కార్డుల్ని పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు.

జోరుగా ఇంటింటా ఓటరు సర్వే

రోలుగుంట: మండలంలోని గ్రామాల్లో ఓటరు నమోదు కోసం చోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.ప్రమీలా గాంధీ ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటా తిరిగి సర్వే చేస్తున్నారు. సర్వేలో భాగంగా నిండుగొండ గ్రామంలో బీఎల్‌వోగా వీఆర్వో పరమానందం తన బృందంతో ఇంటింటికీ వెళ్లారు. కుటుంబంలో ఓటర్ల వివరాలు, కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు తదితర సవరణలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సర్వేను ఆర్ఐ రామ్మూర్తితో కలసి తహసీల్దార్ కె.వరహాలు పర్యవేక్షించారు. అవసరమైన సూచనలు అందించారు.

నేడు పింఛనుదారుల సమావేశం

మాకవరపాలెం: మండలంలోని తామరంలో మంగళవారం ప్రభుత్వ పింఛనుదారుల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు సంఘ అధ్యక్షుడు కోసూరు రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ట్రెజరీ అధికారులు హాజరవుతారని, ఏదైనా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు. సమావేశం అనంతరం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పింఛనుదారులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఆర్వోఎఫ్ఆర్ భూములపై ధర్నా

రోలుగుంట: అటవీ శాఖ పరిధిలో ఉన్న పోడు భూములకు పట్టాలిప్పించాలని, గుర్రాలబయిల, గడబపాలేనికి చెందిన సాగులో ఉన్న భూములపై తమకు హక్కు పత్రాలిప్పించాలంటూ సాగుదారులు సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఎదుట ధర్నా చేశారు. దీర్ఘకాలంగా తమ సాగులో ఉన్న భూములపై తమకు హక్కులు కల్పించి, ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం సాగు వివరాలకు సంబంధించిన వినతిపత్రాన్ని రైతు సంఘం లీడర్ శివలంక కొండలరావుతో కలసి తహసీల్దార్ కె.వరహాలుకు అందించారు. ధర్నాలో సాగుదారులు చీమల నూకాలమ్మ, చిన్ని భవాని, కవల రమణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

నాతవరం: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు పద్మశాలి సంఘం నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని గునుపూడి గ్రామంలో ఇటీవల పసగడుగుల కన్నబాబు, పి.నాగరాజు, పలకా అచ్చియ్యమ్మలు అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయారు. వీరికి అనకాపల్లి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు, రాష్ట్ర పద్మశాలి యువజన సంఘం కార్యదర్శి కొండపల్లి సతీష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు టి.ఈశ్వరరావు, గాజువాక పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొడి శ్రీను, సంఘ సభ్యులు సిద్దార్థ శ్రీనివాసరావు, బాబ్జి, శ్రీనివాసరావులు బాధితులకు రూ.35 వేలు నగదు అందించారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ అధ్యక్షుడు పలకా జోగిరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

నర్సీపట్నం: బెజవాడలో న్యాయవాది హత్యను ఖండిస్తూ స్థానిక న్యాయవాదులు సోమవారం నిరసన తెలిపారు. న్యాయవాది ఆర్.ఆదిశేషు విఠలబాబు హత్యను ఖండిస్తూ న్యాయవాదులు విధులను బహిష్కరించి, కోర్టు ముందు నిరసన చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకువాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ కొరుప్రోలు వెంకటరమణ, గోవర్ధనగిరి, న్యాయ వాదులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ విప్ ధర్మశ్రీ జన్మదిన వేడుకలు

ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



చోడవరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

రావికమతం: మండల పరిషత్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మాజీ అధ్యక్షుడు కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, వైస్ ఎంపీపీ మత్స భవానీప్రసాద్, దంట్ల వెంకట రమణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంటా ఈశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శీలం శంకరరావు తదితరులుర్లు పాల్గొని కేక్ కట్‌చేసి పంచుకున్నారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. పలు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు.

బుచ్చెయ్యపేట : ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ జన్మదిన వేడుకల్లో భాగంగా మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో కేక్ కట్ చేసి ఆస్పత్రిలో రోగులకు పళ్లు, పాలు అందించారు. పలువురు పేదలకు చీరలు పంపిణీ చేశారు.

● మేజర్ పంచాయితీ వడ్డాది రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి ప్రభుత్వ స్థలాల్లో 300 మొక్కలు నాటారు. గున్నెంపూడి, రాజాం, తురకలపూడి, కొమళ్లపూడి, పేట, దిబ్బిడి, ఐయితంపూడి, పీడీ పాలెం తదితర గ్రామాల్లో కేక్ కట్ చేసి పలువురికి స్వీట్లు పంచిపెట్టారు. మండల ఇన్‌చార్జి గేదెల శేషు, మండల నాయకుడు కె.అచ్చింనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, ఎల్లపు గోవింద, సాయం రమేష్, సుంకరి శ్రీను, మోటూరి చిన్నంనాయుడు, భూషణం, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరినాగేశ్వరరావు, కోరుకొండ కామలక్ష్మి సూరి అప్పారావు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ, నాయకులు గుమ్మిడి ప్రసాద్, తలారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: ప్రభుత్వ విప్ ధర్మశ్రీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొవ్వూరు సర్పంచ్ కాంతమ్మ స్థానిక శ్రీ వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేశారు.

– మండల కేంద్రం రోలుగుంట పీహెచ్‌సీలో రోగులకు జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతల లక్ష్మీ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు రొట్టె, పాలు, పండ్లు పంపిణీ చేశారు.

అన్ని వర్గాల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే గణేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీలోని 27వ వార్డులో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని, కుటుంబాల వారీగా వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరుగా ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ పనితీరును, సంక్షేమ పథకాల అమలును తెలుసుకునేందుకే ఈ కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతి పథకాన్ని వలంటీర్ల ద్వారా ప్రజలకు ఇంటి వద్దే అందిస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, వార్డు ఇన్‌చార్జ్ కొణతాల వరలక్ష్మి, టౌన్ అధ్యక్షులు ఏకాశివ, వార్డు నాయకులు జాన్, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషాబేగం, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, సిరసపల్లి నాని, బయపురెడ్డి చినబాబు, కో ఆప్షన్ సభ్యులు షేక్ రోజా, లగుడు స్వామి, టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, నూకాంబిక దేవస్థానం చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, యూత్ అధ్యక్షులు ధనిమిరెడ్డి ప్రసాద్, పార్టీ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, ఏకా రాజుబాబు, యాదిగిరి శేషు, అన్నపూర్ణ, లలిత, శారద తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అదనపు భవనానికి శ్రీకారం



ఆస్పత్రి భవన నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న అనురాధ, జగన్‌మోహన్

కె.కోటపాడు: చౌడువాడ పీహెచ్‌సీలో ల్యాబ్ పరీక్షల నిర్వహణతో పాటు, రోగులు ఉండేందుకు రూ.50 లక్షల నిధులతో భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఎంపీపీ జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ అనురాధ తెలిపారు. ఈ మేరు చౌడువాడ పీహెచ్‌సీ అదనపు భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్, అనురాధ మాట్లాడుతూ ఇప్పటికే చౌడువాడ పీహెచ్‌సీని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో రూ.కోటీ 72 లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతోనే అదనపు భవనాన్ని నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ మంజూరు చేసిన నిధులతో చౌడువాడ, తాళ్లపాలెం, రాంబిల్లి, సబ్బవరం, కేడీ పేట, పాయకరావుపేట, రోలుగుంట పీహెచ్‌సీల్లో ఒక్కో భవన నిర్మాణానికి రూ.50 లక్షలు చొప్పున నిధులు మంజూరైనట్లు ఏపీఈడబ్ల్యూడీసీ ఏఈ రామావతారం వెల్లడించారు. పీహెచ్‌సీతో పాటు చౌడువాడ గ్రామాభివృద్ధికి కోట్లాది రూపాయాలు కేటాయిసుతన్న డిప్యూటీ సీఎంకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నిర్మల, సుబ్రహ్మణ్యం, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, పైల అమ్మాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.